# ఇడ్లీల పందేరం!

ఇడ్లీలంటే ఇష్టంలేనిదెవరికి? ఇంటింటా వారానికొక మారైనా ఇడ్లీలు చేసుకుంటూంటారు. ఏదైనా దీని తర్వాతనే! ఏ హోటల్‌కు వెళ్ళి 'మెనూ' బోర్డు పరికించినా ఇడ్లీ పేరు టాపర్. లిస్టులో మొదటిస్థానం ఇడ్లీదే!

ఇడ్లీలు ఆరోగ్యానికి మంచివి! పేషెంట్లకి సైతం పథ్యం పెట్టాలంటే ఇడ్లీ పెట్టమని డాక్టర్లు రికమెండ్ చేస్తూంటారు.

సుందర్రామయ్య గారికి ఇడ్లీ అంటే పంచప్రాణాలు! వారింట్లో ఇడ్లీ చేయని రోజంటూ వుండదు. వారికి గల పొలంలో నాలుగెకరాల్లో మినుము పంట పండిస్తారు.

నిత్యమూ వచ్చిపోయే జనంతో సుందర్రామయ్య గారిల్లు సందడిగా వుంటుంది. ఏరోజైనా పాతిక విస్తళ్ళకు తక్కువ లేవవు. ఎవరు ఎప్పుడు ఎందుకొచ్చి ఎన్నాళ్ళుండి పోతారో బొత్తిగా పట్టించుకోరు సుందర్రామయ్యగారు.

పదిబస్తాల మినుములు ఇంట్లో ఎప్పుడూ స్టాక్ వుంటుంది. నౌకర్లు నెలకోమారు తిరగళ్ళతో మినుములు పప్పుగా చేసి పెడుతుంటే... వంటావిడ రోజూ ఓ మానెడు పప్పు నానబోసి రోజూ ఇడ్లీ వంటకం... కొబ్బరి చెట్నీ చేసి అందరికీ వడ్డిస్తూంటుంది.

సుందర్రామయ్యగారు సంధ్యావందనం ముగించుకోగానే వేడివేడి ఇడ్లీలతో వెండి పళ్ళెం వారిముందు ప్రత్యక్షమౌతుంది. పాతిక ఇడ్లీలకు తక్కువ లేకుండా అవలీలగా లాగిస్తారాయన.

స్వంత పాడి కావటంతో కరగబెట్టిన స్వచ్ఛమైన నెయ్యి కారంపొడి మీద ఇడ్లీలమీద గిన్నె ఎత్తి పోసేసుకుని వెండిగిన్నెలో పక్కనే వున్న కొబ్బరి చట్నీ నంజుకుంటూ ఆరగిస్తూ... మధ్య మధ్య కళ్ళు మూసుకుని నములుస్తూ... చప్పరిస్తూ ఇడ్లీల రుచికి తదాత్మ్యం చెందుతూంటారు సుందర్రామయ్యగారు.

ఆరడుగుల నిండైన విగ్రహం! బుర్రమీసాలు... విశాల ఫాలభాగం... భుజాలను తాకే జులపాల జుట్టు... నుదిటిన విభూది రేఖలు... మధ్యలో కుంకుమబొట్టు... చేత పొన్నుకర్ర మనిషి ఠీవిగా దర్జాగా ఆరోగ్యంగా వుంటారు.

'మీరలా పొద్దస్తమానం వీధి అరుగుమీద బైఠాయించకండి. దిష్టి తగుల్తుంది' అనేసి భార్య సీతామహాలక్ష్మి నెత్తి నోరూ మొత్తుకున్నా వినే ఘటంకాదు సుందర్రామయ్యగారు.

వారలా కూర్చుని వీధినపోయే వారంతా వినయంగ నమస్కరిస్తుంటే వంబరపడుతూ చేయెత్తి ఆశీర్వదిస్తూ... చిద్విలాసంగా నవ్వుతూ ఎదుటివారిని పలకరిస్తూ తెగ ఆనందపడిపోతూ

వుండడం ఆయనకు అలవాటు.

పైపెచ్చు కట్టుకున్న అర్ధాంగి మాట వినటమంటే వారికి చెడ్డ చిరాకు. భార్య మాట లక్ష్యపెట్టని స్వభావం ఆయనది.

అయినా ఆ మహాసాధ్వి సీతామహాలక్ష్మి అరుగురు ఆడపిల్లలకు... ఎనిమిది మంది మగసంతానానికి తల్లయింది. ఇందరిని కనినప్పటికీ మనిషి పిడిరాయిలా... జలుబు... తలనొప్పి అంటే ఏమిటో తెలీకుండా ఆరోగ్యంగా వుంటోంది.

వంటమనిషికి రోగమొచ్చి నాలుగు రోజులు నామం పెట్టినా... ఇంటెడు చాకిరీ ఆమే చేసుకోగల దృఢకాయం ఆమెది!

ఒకరోజు వంటమనిషి చెప్పకుండా ఎగేయటంతో ముందుగా మినపప్పు నానబెట్టే టైమ్ లేకపోవటాన బియ్యపురవ్వ ఉప్మాచేసి భర్తకి వడ్డించింది సీతామహాలక్ష్మి.

ఇడ్లీలు పళ్ళెంలో లేకపోవటం చూచిన సుందర్రామయ్యగారికి వళ్ళుమండి తనముందు వెండి ప్లేట్లో వున్న ఉప్మాని ఒక్క తాపు తన్నేరు. ఇంకేముంది భర్త రుద్రుడైనందుకు భయంతో గజగజావణికిపోయింది సీతామహాలక్ష్మి.

అది సుతా... ఆ ఇంట్లో ఇడ్లీలు చెయ్యని రోజంటూ లేదు.

సుందర్రామయ్యగారింట్లో ఇడ్లీలంటే అట్లాంటివి ఇట్లాంటివి కావు. అరచేతి సైజులో రెండు అంగుళాల మందాన చూడముచ్చటగా వుంటయ్. వారింట్లో లాంటి ఇడ్లీ మరెక్కడా వుండవ్!

ఈ రోజుల్లో హోటళ్లలో లభించే ఇడ్లీ కాలక్రమేణా సైజు చిక్కిపోయి తమలపాకులంత పలుచగా... రూపాయి బిళ్ళంత సైజుకి నీరసించి కృశించిపోయినయ్. అది వేరే సంగతి!

ఆ ఇంట్లో సీతామహాలక్ష్మి కాదు ఇంటిల్లిపాదీ 'ఇడ్డెన్లు' అంటారేగానీ... ఈ రోజుల్లోలాగ 'ఇడ్లీలు' అనటం ఎవరూ విని ఎరుగరు.

భోజనం లేటైనా సహించేవారుగాని... టైమ్‌కి ఠంచన్‌గా ఇడ్లీలు మాత్రం తనముందు ప్రత్యక్షం కాకపోతే మాత్రం ఫైరింజన్ కోసం కబురుపెట్టాల్సి వస్తుంది. నిముషం ఆలస్యమైతే సుందర్రామయ్యగారి కళ్ళు నిప్పు కణాలయ్యేవి. నాగుపాములా బుసలు కొట్టేవారు. ఆరోజు అందరిమీద అలిగి భోజనం మానేసి ఉపవాసం వుండి ఇడ్లీ చేయనందుకు... టైమ్‌కి వడ్డించనందుకు... ఆ విధంగా నిరసన తెలిపేవారాయన!

ఆరోజుల్లో ఆనవాయితీ ప్రకారం దండిగా డబ్బు ఆస్తిపాస్తులున్నవారు కాబట్టి ఆడపిల్లలందరికీ అయిదు రోజుల పెళ్ళిళ్ళు ఘనంగా జరిపించి వూళ్ళో వారందరినీ భోజనాలకు ఆహ్వానించేవారు.

మగపిల్లల చదువులు పూర్తై ఇంటికొచ్చిన కొత్తల్లో హోటలు తిండికి అలవాటుపడిన వారు కావటంతో తమకు పెసరట్టు ఉప్మా... పూరీ కూర కావాలని తల్లికి చెప్పటం విని ఇంట్లో ఇడ్లీలు తప్ప మరొక టిఫిన్ వుండరాదంటూ శాసించటం చూచి కొడుకులు నోరు మెదపలేకపోయేవారు.

సుందర్రామయ్యగారి వంశంలో చివరి కొడుకు మూడవ సంతానం వినీత్! ఇతగాడి పోలిక... తిండి వ్యవహారం అంతా తాతగారినే అచ్చేసినట్టు వుంటుంది.

వినీత్ కూడా ఇడ్లీ ప్రియుడే! ముప్పొద్దులా భోజనం మానేసి, ఇడ్లీలు తినమన్నా... అందుకు ఇష్టపడతాడు. నిద్రలో కూడా 'నీకేం కావాలిరా?' అంటే తడుముకోకుండా 'ఇడ్లీ' అనేస్తాడు.

వినీత్ చదువు పూర్తై పెళ్ళి చేసుకున్న తర్వాత... శోభనం గదిలో తన ఇష్టాలేమిటో భార్య చెవిలో వూదేడు. కొత్త పెళ్ళికూతురు సిగ్గుతో మెలికలు తిరిగిపోయి వినీత్ చెప్పిన దానికల్లా చిరునవ్వు నవ్వి తలూపింది. ఇంకేముంది... తన ఇడ్లీలకెలాంటి ఢోకా వుండదనుకుని మురిసాడు.

పెళ్ళి అయిన నెల్లాళ్ళకల్లా సిటీలో కాపురం పెట్టేసాడు వినీత్! చేసే ఉద్యోగం బ్యాంక్ ఆఫీసర్ అయినా మనిషి ఛాందసుడిలా... పక్కా పాతకాలం మనిషిలా వుంటాడని ఫ్రెండ్స్ సర్కిల్లో కామెంట్ చేస్తున్నా... వాటిని చెవికెక్కించుకున్నా... తాను మాత్రం మారడు!

టిఫిన్ చేసే విషయంలో వినీత్‌కి భార్యతో రోజూ రగడే! ఇడ్లీ తప్ప వేరే ఏ ఇతరమైన టిఫిన్ ఇంట్లో చేయటానికి వీల్లేదని మొండిపట్టు పడతాడు. భార్య కాస్త నోరు కలది కావటాన వినీత్ మాటకి ఎదురుచెప్పటం... వారానికొకసారైనా ఇంట్లో ఇడ్లీలు చేయకపోవటం చూస్తూ 'ఇలా అయితే నీతో కాపురం చేయను. నీకు విడాకులైనా ఇస్తాను గానీ... నేను రోజూ ఇడ్లీలే తినటానికి మాత్రం ఫుల్‌స్టాప్ పెట్ట'నంటూ ఒంటికాలిమీద లేచేవాడు.

నావల్లకాదు బాబూ! రోజూ ఇడ్లీపిండి రోట్లో రుబ్బుతుంటే నా జబ్బలు పడిపోతున్నాయ్. మీకేం!... తయారుచేసి ప్లేట్లో పెడితే అలవోకగా ఇరవై లాగిస్తారు! చేసేవాళ్ళకి తెలుస్తుంది బాధ! అయినా... రోజూ అవే తినటానికి మీకు మనసెలా వప్పుతుంది?... ఎంచక్కా... రోజుకో వెరైటీ టిఫిన్ చేసిపెడితే తినచ్చుగా...' విసుగు... కొంచెం దెప్పుడు ధ్వనించినయ్ భార్య శ్రీదేవి మాటల్లో.

'నువ్ లక్ష చెప్పు! వంశాచారంగా వస్తున్న అలవాటు నేను మానుకోలేను...' తెగేసి మరోసారి చెప్పాడు వినీత్.

'అయితే ఒక పని చెయ్యండి! నేను పప్పు రోటిలో రుబ్బలేక ఛస్తున్నాను. ఓ గ్రైండర్ కొని పట్రండి!... అట్లాగే మీ కోరిక తీరుస్తాను...' బుంగమూతి పెట్టింది శ్రీదేవి.

'ఎంత నేను ఆఫీసర్నైనా... మనింట్లో గ్రైండర్... మిక్సీ... వాషింగ్ మెషీన్ వంటివి వుండటానికి వప్పుకోను. చచ్చినట్లు నువ్వు ఎంచక్కా రోలు వినియోగించు కోవలసిందే! కరెంట్ ఖర్చు ఎక్కువైతే దుంప తెగుతుంది. అందునా ఉదయం పవర్‌కట్ ఒకటి ఏడ్చిందిగా... అధవా నేను కొని తెచ్చినా నీ రుబ్బుడు కార్యక్రమానికి విఘాతం కలుగుతుంది. క్రితంరోజే పిండి రుబ్బి వుంచావనుకో పులుస్తుంది. పులవకుండా వుంచేటందుకు మనింట్లో ఫ్రిజ్ లేదుగా?! అందుకే తెల్లార కట్టే లేచి... చలాకీగా రోటిలో పిండి రుబ్బావనుకో... అబ్బ! దాని రుచే వేరు...' లొట్టలేస్తూ మాట్లాడాడు వినీత్.

'శ్రీవారూ! ఇడ్లీ కావలసింది మీకు! తినేది మీరు! నాకు అక్కర్లేదు. కనుక... ఆ రుబ్బుడు కార్యక్రమమేదో ... క్రమం తప్పకుండా మీ స్వహస్తాలతో చేస్తే.. నాకు శ్రమా తప్పుతుంది.... మీకు కరెంట్ ఖర్చూ వుండదు. ఏమంటారు?...' కొంటెగా భర్త ముఖంలోకి చూస్తూ ఓ చురకేసింది.

శ్రీదేవి మాటలు అట్లకాడ నిప్పుల్లో ఎర్రగా కాల్చి వీపున వాతపెట్టినట్టన్పించింది వినీత్‌కి!

'భర్తననే గౌరవం లేకుండా నోటికొచ్చినట్టల్లా పేలేవంటే... చెంప పగుల్స్... వీపు విమానం మోత మోగూస్...' కోపంతో కళ్ళెర్ర చేసాడు.

'ఆఫ్ట్రాల్ ఇడ్లీ టిఫిన్ కోసం మనిద్దరం పోట్లాడుకోవటం ఎవరైనా వింటే నవ్విపోదురు. ఇక ఆపండి! మీ ఆవేశానికి సంకెళ్ళు వెయ్యండి...' అనేసి టాపిక్ మార్చి కిచన్లోకి తుర్రుమంది శ్రీదేవి.

★★★★★

'ఏం శ్రీవారూ... ఈరోజు ఆఫీసుకి 'డుమ్మా' కొట్టారా?... పదిగంటలు దాటినా ఇంకా ఇల్లు వదల్లేదు...' శ్రీదేవి కనుబొమలెగరేస్తూ భర్త ముఖంలో చూస్తూ కొంటెగా అడిగింది.

'అవునవును...' అదోలా నవ్వాడు వినీత్.

'అంతేనా... లేకపోతే మరో వాయి ఇడ్లీ లాగిద్దామనా?...'

'ఛస్... నోర్ముయ్! అన్నట్టు మనం ఈరోజు మా గ్రాండ్‌ఫాదర్స్ నేటివ్ విలేజ్‌కి టాక్సీలో వెడుతున్నాం! ఎల్లుండి మా తాతగారైన సుందర్రామయ్యగారి ఆబ్దికం!... రెండురోజులు శలవు పెట్టేశాను... గెటొరెడీ...'

'అదా విషయం! మీరు వెళ్ళిరండి...నేను ఆ విలేజ్‌కి రాలేను... టాయ్‌లెట్స్‌కి చెరువుగట్టుకు చెంబు పుచ్చుకు వెళ్లటం... డర్టీ!... నావల్లకాదు...'

'చూడూ!... ఒకచో నేలను పవ్వళించు ఒకచో నొప్పారు పూసెజ్జపై...' అనే పద్యం

చిన్నప్పుడు చదువుకోలేదా?... సిటీ లైఫ్‌కి అలవాటుపడి వేషాలేయద్దు...' చిన్న వార్నింగ్‌లాంటిది ఇచ్చాడు.

'మీతో వాదించి గెలవలేను గానీ... అట్లాగే వస్తానులెండి... వెళ్ళి బట్టలు సర్దుకుంటాను...

'నా గుడ్డలు కూడా నీ వాటితోపాటు ఒకే బేగ్‌లో పెట్టు...' అనేసి రిసీవర్ చేతిలోకి అందుకుని టాక్సీకోసం ట్రావెల్ ఏజన్సీకి ఫోన్ చేసాడు.

టాక్సీలో చీకటి పడేవేళకి తాతగారి స్వగ్రామం చేరుకున్నారు వినీత్ శ్రీదేవి.

గ్రామ సర్పంచ్ ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళి టాక్సీ దిగారు.

'నమస్కారం వినీత్‌గారూ! మొత్తానికి ఏడాదికి మావూరొచ్చారు! మాకోసం కాకపోయినా మీతాతగారి వూరు వచ్చి ప్రతి సంవత్సరం ఆయన జ్ఞాపకార్థం మీరు గ్రామస్తులందరికీ ఇచ్చే ఇడ్లీలు విందు కోసమైనా ఆనవాయితీ మానకుండా వచ్చినందుకు సంతోషం!...' ఎదురై ఇంట్లోకి ఆహ్వానించాడు సర్పంచ్.

భార్యాభర్తలిరువురూ ఇంట్లోకి నడిచారు.

అర్ధికం రోజు తెలతెలవారుతుండగా సామగ్రితో వంట వాళ్ళొచ్చారు.

తెల్లారి ఉదయం పదిగంటలకల్లా ఇడ్లీలు రెడీ చేసారు వంటవాళ్ళు.

బారులు తీరి సర్పంచ్ ఇంటిముందు నిలబడిన గ్రామస్తులందరికీ తాతగారి జ్ఞాపకార్థం ఇడ్లీలు పందేరం చేసి తృప్తిగా నవ్వుకున్నాడు వినీత్!

- సమాప్తం -